రేషన్ బియ్యం విక్రయం.. యువకుడిపై కేసు

కాచిగూడ, జనవరి 18: గుట్టుచప్పుడు కాకుండా పేదల ఇండ్లల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని తీసుకుని అధిక ధరలకు అమ్ముతున్న యువకుడిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన ప్రకారం.. ఫాతిమానగర్‌కు చెందిన అసద్(26)పేదలు నివసించే ప్రాంతాలను ఎంచుకుని తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని తీసుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. శనివారం సమాచారం తెలుసుకున్న కాచిగూడ పోలీసులు అసద్ ఇంట్లో 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. అసద్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అజంతా రైల్లో దొంగతనం

కాచిగూడ, జనవరి 18: అజంతా రైల్లో ప్రయాణికుడి బంగారు ఆభరణాలు దొంగిలించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప తెలిపిన ప్రకారం.. ఖమ్మం ప్రాంతానికి చెందిన రామయ్య భార్య బి.నాగమ్మ(42)అజంతా రైల్లో కాచిగూడకు వస్తుండగా.. మార్గమధ్య బాసర రైల్వేస్టేషన్ సమీపంలో ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. అందులో 20 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నట్లు తెలిపారు. శనివారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

సంతోష్‌దాస్

మెహిదీపట్నం, జనవరి 18: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి కనిపించకుండా సంఘటన లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. లంగర్‌హౌస్ ప్రశాంత్‌నగర్‌లో నివసించే సంతోష్ దాస్(27) సీసీ కెమెరాల ఆపరేటర్‌గా పని చేసేవాడు. ఇతడు 2024 జూలై 13వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అతడి గురించి అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో భార్య లంగర్‌హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఫుట్‌పాత్‌పై వృద్ధుడు మృతి

కాచిగూడ, జనవరి 18: ఫుట్‌పాత్‌పై ఓ వృద్ధుడు మృతి చెందాడు. కాచిగూడ అడ్మిన్ ఎస్సై డి.సుభాశ్ తెలిపిన ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(70) కాచిగూడ పోస్టాఫీస్ ఫుట్‌పాత్‌పై చలికి శనివారం మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై బూడిద రంగు చొక్కా, నషం రంగు ప్యాంట్ ధరించి.. ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

ఆంధ్రనాట్యకళ ను భావితరాలకు అందించాలి


ఆంధ్రనాట్య పోటీలలో పాల్గొన్న గురువులు, కళాకారులు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 18 : స్వరనర్తన సంగీత, నృత్య, యోగా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆంధ్ర నాట్య పోటీల విజేతలచే నృత్య ప్రదర్శనలు అనంతరం బహుమతుల పంపిణీ ఘనంగా జరిగింది. ప్రముఖ నృత్య గురువు పద్మామోహన్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత నృత్య గురువు డాక్టర్ కళాకృష్ణ మార్గదర్శకత్వంలో సాగిన ఆంధ్రనాట్యకళ ప్రక్రియను పరిరక్షించి భావితరాలకు అందిస్తున్న నృత్య గురువులను, పోటీలలో విజేతలుగా నిలిచిన ఔత్సాహిక కళాకారులను ఘనంగా సన్మానించారు. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి దెందులూరి నలినీ మోహన్, ప్రసిద్ధ నాట్యకారిణి సభితా భమిడిపాటి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డుగ్రహీత, పద్మశ్రీ డి. ఉమామహేశ్వరి పాల్గొని ఆంధ్ర నాట్యం విశిష్టతను తమ ప్రసంగంలో వివరించారు. స్వరకనర్తన బృందం సనీలా శ్రవంతి, కల్పన, పవన్, సంధ్య, ధర్మవేద, మహతి, సాయి సమన్వయం చేశారు.

రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన కేసీఆర్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు నాగేందర్‌బాబ్జి, బబ్లూసింగ్, రమేశ్, శేషు, అంటో

కాచిగూడ, జనవరి 18: కేవలం తొమ్మిదిన్నర కాలంలోనే మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, దేశంలోనే తెలంగాణను అగ్రగామి రాష్ట్రంగా నిలిపారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. శనివారం కాచిగూడలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలేరు హాజరై మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను తీర్చాలేక.. పదేండ్లు మంత్రిగా పని చేసి మచ్చలేని నాయకుడు మాజీ మంత్రి కేటీఆర్‌పై పసలేని కుట్ర పూరితమైన కేసులు పెడుతున్నారని ఆరోపించారు. భూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో కాంగ్రెస్‌ను ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. పేదల కోసం సంక్షేమ పథకాలను చేపట్టిన బీఆర్ఎస్ పార్టీని రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో గెలిపించడానికి ప్రజలు సంసిద్ధులై ఉన్నారని, మాజీ సీఎం కేసీఆర్ పథకాలను సద్వినియోగపరుచుకున్న లబ్ధిదారులందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, బబ్లూసింగ్, ఎల్.రమేశ్, శేషు,అంటో పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్ మార్కెట్ అభివృద్ధికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘుపాల్ రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

కార్వాన్, జనవరి 18: గుడిమల్కాపూర్ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘుపాల్ రెడ్డి తెలిపారు. ఈ విషయమై ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత 30ఏండ్లుగా కాంగ్రెస్ కార్యకర్తగా పనిచేస్తున్న తనకు పార్టీలో తాను చేస్తున్న సేవలను గుర్తించి కార్వాన్ నియోజకవర్గం నుంచి మార్కెట్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు పార్టీ అగ్రనాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌లో రైతులకు అండగా ఉంటానని, రైతు సమస్యల పరిష్కరిస్తానన్నారు. మార్కెట్‌లో రైతుతోపాటు దుకాణందారులు, విక్రేతలు, వినియోగదారుల సమస్యలు గుర్తించి పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో కార్వాన్ నియోజకవర్గం బి-బ్లాక్ అధ్యక్షుడు కూరాకుల క్రిష్ణ, రాష్ట్ర నాయకుడు వినోద్ సింగ్, కాంగ్రెస్ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హమీద్, జియాగుడా డివిజన్ అధ్యక్షుడు కిషన్ గజ్రె, కార్వాన్ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు షేక్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యలు లేకుండా చూడండి

ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చూడాలని కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్ జలమండలి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శనివారం టోలిచౌకి ఎమ్మెల్యే కార్యాలయంలో జలమండలి జీఎం శ్రీనునాయక్,సిబ్బందితో ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న మంచి నీటి పైప్‌లైన్‌ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని, లోప్రెషర్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ స్టాండింగ్‌కమిటీ సభ్యులు,నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జనవరి18

బీసీ బిల్లుకు పార్టీలు మద్దతిఇవ్వాలి

నింబోలిఅడ్డాలో ధర్నా నిర్వహిస్తున్న రాజేందర్‌పటేల్‌గౌడ్,రాష్ట్ర బీసీ నాయకులు

కాచిగూడ,జనవరి 18: పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర బీసీ మహాసభ ఆధ్వర్యంలో పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు పూర్తి మద్దతు ఇవ్వాలని కోరుతూ శనివారం రాష్ట్ర బీసీ నాయకులతో రాజేందర్‌పటేల్‌గౌడ్ కలిసి నింబోలిఅడ్డాలో ధర్నా నిర్వహించారు. అనంతరం రాజేందర్ పటేల్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటి వరకు 34 మంది ముఖ్యమంత్రులు పాలించినా బీసీల భతుకులు ఎక్కడ వేసిన గొంగళి..అక్కడే అన్న చందంగా ఉందని, అందుకు బీసీలు సంఘటితమై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పూలిజాల కృష్ణ,మెట్టు ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్, కిశోర్‌గౌడ్, పాల్గొన్నారు.

కులగణన చేయాలని కేంద్రంపై ఉద్యమం

మాట్లాడుతున్న జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తదితరులు

కాచిగూడ,జనవరి 18: జనాభా గణనలో కులగణన చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచడానికి వేలాది మందితో జాతీయ స్థాయిలో ఉద్యమం చేయనున్నట్లు జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హెచ్చరించారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల భావితరాల కోసం కేంద్ర ప్రభుత్వం జనాభా గణనలో కులగణన చేపట్టాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. కులగణనపై బీజేపీ మంత్రులు,ఎంపీలకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రధానిపై ఒత్తిడి తేవాలని, జనగణనలో కులగణన చేయాలని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. బీసీల ఆకాంక్షలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. బీసీల మనో భవాలను గ్రహించి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో కులగణన తీర్మాణం చేసి కేంద్రానికి పంపించి తన నిజాయితిని నిరుపించుకున్నాడని గుర్తుజేశారు. దేశ జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందన్నారు. స్వాతంత్రం వచ్చి 76 యేండ్లు దాటిన బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయమే జరుగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లాల బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బద్దం సతీశ్ గౌడ్, మేఘు, గ్రేటర్ హైదరాబాద్ డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్ ఎస్ ధన్‌రాజ్, నాయకులు అశోక్, అశోక్ జైన్, ప్రభ తదితరులు పాల్గొన్నారు. – (అబిడ్స్, జనవరి 18)

విద్యతోపాటు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి

నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్

నిజాం కళాశాలలో యువ ఎంపవర్ 2కే25 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్ తదితరులు

సుల్తాన్‌బజార్,జనవరి 18: విద్యార్థులు విద్యతో పాటు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫె సర్ ఏవీ రాజశేఖర్ అన్నారు. శనివారం ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ, నిజాం కళాశాలల సంయుక్తాధ్వర్యంలో స్వామి వివేకానంద స్వామి జయంతి సందర్భంగా ఈనెల 23వ తేదీలలో నిజాం కళాశాల వేదికగా నిర్వహిస్తున్న యువ ఎంపవర్ 2కే25 పేరిట పోస్టర్‌ను ఆయన కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాధిక, ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడేలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిస్టర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే మాట్లాడుతూ ఈ మువ ఎంపవర్ 2కే25లో పాల్గొన దలచిన విద్యార్థులు రిజిస్ట్రేషన్, పోటీల వివరాల గురించి తెలుసుకునేందుకు గాను 9505155506/6304812284 నంబర్‌లలో సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో ఆయిస్టర్ సంస్థ అగ్రికల్చర్ మినిస్టర్ అరవింద్,సభ్యులు రాజు,శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎం ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని గౌలిగూడ, రామ మందిరం, నకాషి గల్లి, బాలాజీ లాడ్జ్ లేన్ తదితర ప్రాంతాల్లో ఆయన అధికారులు, పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర చేసి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రాజు, మోహన్ యాదవ్, మెహర్, ప్రదీప్, లక్ష్మీనారాయణ, సాయిరాం యాదవ్, రామకృష్ణ, నరసింహ, అశోక్, ప్రవీణ్, వామన్, రాజు, నరేష్, ఎస్‌కె మెహతా, అప్పు, శాంక్, కొండల్, మారుతి, మహేశ్, శ్రవణ్, నరేందర్, సాయి, మంజుల, సంగీత, పార్వతి, వనజ పాల్గొన్నారు. – అబిడ్స్, జనవరి 18

సుప్రీం కోర్టు జడ్జిమెంట్‌ను నిలిపివేయాలి

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్ సుప్రీం కోర్టు జడ్జిమెంట్ ఇచ్చిన భారత పార్లమెంట్‌లో చర్చ జరుపకుండా రాష్ట్రంలో వర్గీకరణ చేయకూడదని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డా.విఎల్ రాజు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ఎస్సీ,ఎస్టీ న్యాయవాదుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళిత జాతులను సామాజికంగా, రాజకీయంగా అణివేసి బానిసలుగా చేసుకోవడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పాలకులు, కులపార్టీలు కుట్రలు చేశాయన్నారు. కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సిలివేరి వసంతరావు, అశోక్, పి.రాజలింగం నేతకాని, రవీందర్‌నాయక్,, విశ్వనాథం, రమేశ్, జేయన్‌రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. – రవీంద్రభారతి, జనవరి18

ముదిరాజ్‌ల అభ్యున్నతికి బస్సు యాత్ర

రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన ముదిరాజ్‌లను చైతన్యపరచడమే లక్ష్యంగా ముదిరాజు ప్రజా చైతన్య యాత్రను చేపట్టినట్లు జాతీయ బీసీదళ్ అధ్యక్షులు దుండ్రకుమారస్వామి తెలిపారు. గన్‌పార్కులోని తెలంగాణ అమర వీరుల స్థూపం వద్ద ముదిరాజు ప్రజా చైతన్య యాత్రను చేపట్టిన నాయకులు నెల్లి లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రను ప్రారంభించిన జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమార స్వామి మాట్లాడుతూ.. శివ ముదిరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర మొదటి విడతగా తెలంగాణలోని ఐదు జిల్లాలో పర్యటించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మ, ఉప్పరి నారాయణ, చిన్న రాములు, కూర వెంకటయ్య, కోట్ల పుష్పలత, ప్రజా సంఘాల నాయకులు, న్యాయవాదులు, మేధావులు, కులసంఘాల నాయకులు పాల్గొన్నారు. –తెలుగు యూనివర్సిటీ, జనవరి 18

బీఎంఎస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉస్మానియా దవాఖాన ఆవరణలో శనివారం బీఎంఎస్ యూనియన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను దవా ఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాఖేష్ సహాయ్,ఆర్ఎంవో-1 డాక్టర్ జయక్రిష్ణలు ఆవిష్కరించారు. బీఎంఎస్ యూని యన్ నాయకులు గొల్లపల్లి అనిల్‌కుమార్,జీపీ క్రిష్ణ,చారి,మహేష్‌తో పాటు బీఎంఎస్ నాయకులు పాల్గొన్నారు. –(సుల్తాన్‌బజార్,జనవరి 18)

మత్స్య మహిళ ల జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

మత్స్య మహిళల జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించిన తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, జనవరి 18: మత్స్య మహిళల జాతీయ సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కోరారు. మత్స్య మహిళల జాతీయ సదస్సు పోస్టర్‌ను ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 8వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే సదస్సుకు రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి మహిళలు భారీగా తరలి రానున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖలు పాల్గొంటారని తెలిపారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి


డివిజన్‌లో రేషన్‌కార్డుల సర్వేను నిర్వహిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు, కార్పొరేటర్ ఉమా, స్థానికులు

కాచిగూడ, జనవరి 18: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలందరికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్ యాదవ్ అన్నారు. డివిజన్‌లోని చెప్పల్‌బజార్, మణియార్‌పట్టి, కుద్బిగూడ, వీరన్నగుట్ట బస్తీలలో శనివారం రేషన్ కార్డుల సర్వేను అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలందరికి రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, సివిల్ సప్లయ్ అధికారులు రోహిత్, మధు, విష్ణు, ప్రమోద్, అశోక్,రాము, భీంరాజ్, వాసు, సంతోశ్, ఓంప్రకాశ్, రవియాదవ్, పాల్గొన్నారు.

కాచిగూడ డివిజన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన బల్వీర్‌ను శనివారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సన్మాంచారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమా, కన్నె రమేశ్‌యాదవ్, సుభాశ్‌పటేల్, సూర్యప్రకాశ్‌సింగ్, భీంరాజ్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ, జనవరి 18

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

అంబర్‌పేటలో ఘనంగా దివంగత నందమూరి తారకరామారావు వర్ధంతిని నిర్వహించారు. శనివారం అంబర్‌పేట పటేల్‌నగర్ చౌరస్తాలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధికార ప్రతినిధి వెంకటేశ్ చౌదిరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పరుశురాం, నర్సింహగౌడ్, కె.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. – గోల్నాక, జనవరి 18

ప్రాకృతిక వారసత్వ శిలలను కాపాడుకుందాం..

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రకృతి, చరిత్రను పరిరక్షించుకునే లక్ష్యంలో భాగంగా వర్సిటీ చరిత్ర, సంస్కృతి, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బాచుపల్లి ప్రాంగణంలో విభిన్న ఆకృతులు ఉన్న రాతిశిలల సమీపంలో ప్రాకృతిక శిలలను కాపాడుకుందాం నినాదంతో శనివారం చేపట్టిన కార్యక్రమాన్ని వీసీ ఆచార్య నిత్యానందరావు ప్రారంభించి గతానికి వర్తమానానికి అనుసంధాన చరిత్రను తెలిపే వారసత్వ శిలలను రక్షించుకునే భాధ్యత పౌర సమాజపై ఉందని గుర్తు చేశారు. – (తెలుగు యూనివర్సిటీ)

నేడు యువ భువన విజయం రూపకం ప్రదర్శన

తెలుగు యూనివర్సిటీ, జనవరి 18: శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, చిమ్మపూడి ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియంలో 19న ఆదివారం సాయంత్రం 6గంటలకు యువ భువన విజయం సాహిత్య సంగీత రూపకం ప్రదర్శన ఉంటుందని భాషా నిలయం గౌరవ కార్యదర్శి టి. ఉడయవర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఎంతో విశిష్టమైన భువన విజయం రూపకాన్ని నేటితరానికి తెలియజేయాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. శాసన మండలి సభ్యులు సురభివాణీదేవి, విశ్రాంత ఐఎఎస్ అధికారి డాక్టర్ కేవీ.రమణాచారి, తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య వెల్దండ నిత్యానందరావు, సాహితీవేత్తలు డాక్టర్ ఓలేటి పార్వతీశం, డాక్టర్ మరుమాముల దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలి

కాచిగూడ, జనవరి 18: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని, రేపటి పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్‌ను నిర్వహిస్తుందని కాచిగూడ డివిజన్ ఆపరేషన్ స్మైల్-11 ఇన్‌చార్జి మేఘన అన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా చార్మినార్ ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్లా కుమారుడు షేక్ తోహేల్(17)తిలక్‌నగర్ లోని ఆలీషా పాన్‌షాపులో పనిచేస్తున్నాడు. శనివారం ఆలీషా పాన్‌షాపుకు చేరుకుని షేక్ తోహేల్‌ను చేరదీసి సైదాబాద్‌లోని చైల్డ్ లైన్‌కు అప్పగించారు. ఇన్‌చార్జి మేఘన మాట్లాడుతూ.. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా వివిధ హోటళ్లు, వ్యాపార సముదాయాలు, పలు షాపులలో పని చేస్తున్న పిల్లలను చేరదీసి, తగిన సూచనలు ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Merdha Maruthi Prasad** is owner of Portion of H.No. 13-4-237/1 and 13-4-237/1/A, land admeasuring 110 Sq.yds., situated at Subzimandi, Hyderabad, who acquired the same vide Registered Gift Deed No. 7281/2019, Dated 22-11-2019. The original link documents Registered Sale Deed No. 2115/2013, Dated 15-4-2013 is lost.

Whosoever has found the above mentioned original documents and whoever has got any claims or rights over the above mentioned property, Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.